సాధికార యాత్ర విజయవంతం చేయాలి

- రానున్న ఎన్నికల్లో జగన్‌ను సీఎం చేయాలి
- ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: ఈ నెల 28వ తేదీన కంకిపాడులో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం తాడిగడప మున్సిపాలిటీ, పెనమలూరు మండల పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో జగనన్న పాలనలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. గత ఎన్నికల సమయంలో జగనన్న ప్రకటించిన నవరత్నాలను జగన్ అమలు చేసి పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు జగనన్న అన్నివిధాలుగా ఆదుకున్నారని అన్నారు. రాష్ట్రంలో పేదలకు సామాజిక న్యాయం చేసే విధంగా జగన్ ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఈ నెల 28వ తేదీన కంకిపాడులో జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రలో పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కంకిపాడు సెంటర్‌లో ఆ రోజు సాయంత్రం జరిగే ఈ యాత్రతో ప్రతిపక్షాలకు వణుకు పుట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, పెనమలూరు మండల అధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ నినావత్ చిన్ని, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్, సర్పంచిలు లింగాల భాస్కరరావు, కాకర్ల వెంకటరత్నం, పార్టీ నేతలు అక్బర్‌పాషా, చక్కా గోపీకృష్ణ, వల్లే నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీ



గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలో మాలధారులైన అయ్యప్పస్వామి భక్తులకు జరుగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాములకు స్వయంగా ఎమ్మెల్యే సద్ది వడ్డించారు. అనంతరం అయ్యప్పస్వామి భక్తులు ఏర్పాటు చేసిన పీఠంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దాతల సహకారంతో రోజుకు 300 మందికి పైగా అయ్యప్ప, భవానీ, గోవింద, శివ మాలధారులకు నిత్యం అన్నదానం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, పలువురు పార్టీ నేతలు, గురుస్వాములు పాల్గొన్నారు.

మానికొండలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

ఉంగుటూరు: మానికొండ, వేంపాడు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద శనివారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రచార వాహనం ద్వారా సంక్షేమ పథకాలపై అవగాహన యాత్ర నిర్వహించారు. ఎంపీడీవో శేషగిరిరావు పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలకు ఎవరు అర్హులు అనే అంశాలను తెలియజేశారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ అమీర్ బాషా, కార్యదర్శి కిశోర్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నిడమానూరులో మండల స్థాయి సైన్స్ ఫెయిర్

విజయవాడరూరల్: నిడమానూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ నెల 18వ తేదీన మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.సూరిబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు సైన్స్ విజ్ఞాన ప్రదర్శనకు హాజరై తాము చదువుతున్న పాఠ్యాంశాల్లో సైన్స్‌కు సంబంధించిన కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయలాజికల్ సబ్జెక్టుల్లో ప్రాజెక్టులను ప్రదర్శిస్తారని ఏఈఓ సూరిబాబు తెలియజేశారు. మండల స్థాయి విజేతలు జిల్లా స్థాయిలో జరిగే సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంటారని ఆయన తెలియజేశారు.

లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పోరాడాలి

పెనమలూరు: మహిళా ఉద్యోగులు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురవుతే సమర్థంగా ఎదుర్కొని పోరాడాలని హైదరాబాద్‌కు చెందిన భూమిక ఉమెన్స్ సంస్థ డైరెక్టర్ సత్యవతి అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో వేధింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సత్యవతి మాట్లాడుతూ మహిళలకు రక్షణగా లైంగిక వేధింపుల నిరోధక చట్టం ఉందన్నారు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని సూచించారు. మహిళలు ధైర్యంగా ఉంటే హక్కులు పరిరక్షించుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు అనుపమ, కె.నాగశ్రీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థినులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడి మృతి

గన్నవరం: జాతీయ రహదారి దాటుతున్న ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి స్థానిక సినిమా హాల్ సెంటర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం...గన్నవరానికి చెందిన సయ్యద్ నజీర్(43) సినిమా హాల్ సెంటర్‌లో పాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి అగ్గిపెట్టె తీసుకువచ్చేందుకుగాను జాతీయ రహదారి దాటుతున్న సమయంలో ఏలూరు నుంచి విజయవాడ వైపుగా వేగంగా వెళ్తున్న వాహనం ఆతనిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో నజీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: యువతి అదృశ్యమైన ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక హనుమాన్ నగర్‌కు చెందిన నాయుడు వెంకటలక్ష్మి(20) శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవటంతో ఆందోళనతో తల్లిదండ్రులు గాలించడం మొదలుపెట్టారు. బంధువులు, స్నేహితులను ఆరా తీసినప్పటికీ వెంకట లక్ష్మి ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి కనకదుర్గ శనివారం హనుమాన్‌జంక్షన్ పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీ

గన్నవరం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ అనుబంధ విభాగాల నాయకులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సూచించారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన జలసూత్రం రామ్మోహన్‌రావు శనివారం ఎమ్మెల్యే వంశీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జలసూత్రంను ఆయన దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం వంశీమోహన్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీ వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున మేలు చేసిందన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, పార్టీ నాయకులు కైలే శివకుమార్, నాగసబోయిన గిరీష్‌రాజు, తిరివీధి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదంపాడులో టీడీపీ హై డ్రామా

- టీడీపీ నాయకుని కార్లను ఆగంతకులు ధ్వంసం చేస్తే ప్రభుత్వంపై నిందలా?
- రాజకీయ లబ్ధి కోసం జాతీయ రహదారిపై బైఠాయింపు
- వైఎస్సార్ సీపీ నాయకుల ఆగ్రహం



జాతీయ రహదారిపై బైఠాయించిన యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ నాయకులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో టీడీపీ నాయకులు శనివారం హైడ్రామా సృష్టించారు. గ్రామంలో టీడీపీ నాయకుడు గూడవల్లి నరసయ్య కార్లను శుక్రవారం అర్ధరాత్రి ఆగంతకులు ధ్వంసం చేశారు. ఈ ఘటనను సాకుగా చూపుతూ రాజకీయ లబ్ధి కోసం నరసయ్య విఫలయత్నం చేశారు. గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు టీడీపీ నాయకులను కలుపుకొని హడావుడి చేస్తూ జాతీయ రహదారిపై నిరసన ర్యాలీతో బైఠాయించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో హైవేపై రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం టీడీపీ నాయకులకు అలవాటైపోయిందని, ఎవరో గుర్తు తెలియని ఆగంతకులు కార్లను ధ్వంసం చేస్తే తమ పార్టీపై, నాయకులపై బురద జల్లుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎనికేపాడులోని విజయవాడ రూరల్ మండల కార్యాలయంలో శుక్రవారం రాత్రి టీడీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారని, ఈ సమావేశంలో టీడీపీ అంతర్గత గొడవల కారణంగా ఆ పార్టీలోని వారే ఈ కార్ల ధ్వంసానికి పాల్పడి ఉంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. దాడులు చేసే సంస్కృతి వైఎస్సార్‌సీపీ నాయకులకు లేదని పోలీసు ఉన్నతాధికారులు ఈ కార్ల ధ్వంసం ఘటనపై విచారణ జరుపుతున్నారని నిజానిజాలు బయటపడతాయని, అప్పుడు ఎవరు ఎలాంటి వారో స్పష్టం అవుతుందన్నారు.

పీవీపీ సిద్ధార్థలో జాతీయ స్థాయి పోటీలు



కానూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు, అధ్యాపకులు

పెనమలూరు: స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 19, 20 తేదీల్లో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అన్నారు. కాలేజీలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్ఐహెచ్) విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ జాతీయ స్థాయిలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తుందని చెప్పారు. దేశవ్యాప్తంగా 26 కేంద్ర మంత్రిత్వ శాఖలు, 6 రాష్ట్ర మంత్రిత్వ శాఖలు, 4 పరిశ్రమల భాగస్వామ్యంతో జరుగుతుందన్నారు. పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో నోడల్ కేంద్రంగా సాఫ్ట్‌వేర్ కేటగిరిలో 5 ఈవెంట్‌లో(థీమ్స్) నిర్వహించనున్నామని తెలిపారు. దీనిలో 27 అగ్రశ్రేణి జట్లు నుంచి 162 మంది పాల్గొని తమ నైపుణ్యం ప్రదర్శిస్తారని అన్నారు. ప్రతి ఈవెంట్‌లో గెలుపొందిన జట్టుకు రూ.లక్ష చొప్పున 5 జట్లకు రూ.5 లక్షలు బహుమతి ఉంటుందని తెలిపారు. 19వ తేదీన పీఎం నరేంద్రమోదీ ఆన్‌లైన్‌లో విద్యార్థులతో మాట్లాడుతారని తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ సెంటర్ అధికారి డాక్టర్ పి.సాయికిరణ్, టెక్నికల్ హెడ్ డాక్టర్ జగదీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్



విలేకరుల సమావేశంలో చైన్ స్నాచర్లతో హనుమాన్‌జంక్షన్ సీఐ, ఆత్కూరు ఎస్ఐ

ఉంగుటూరు: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను ఆత్కూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో హనుమాన్‌జంక్షన్ సీఐ ఎ.నవీన్ నరసింహమూర్తి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆత్కూరు గ్రామంలో ఈ నెల 11న ముగ్గిరాల అనూష ఓ ప్రైవేటు కంపెనీలో పని ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళుతోంది. నయారా పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారి సర్వీసు రోడ్డు నుంచి సిమెంటు రోడ్డులోకి ఒంటరిగా వెళుతున్న సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నానుతాడు తెంచుకుని అప్పటికే అక్కడ బైక్ పైన సిద్ధంగా ఉన్న వ్యక్తితో కలసి పారిపోయారు. అదే రోజు ఆమె ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుతో ఆత్కూరు ఎస్ఐ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాల మేరకు గన్నవరం డీఎస్పీ ఆర్.జి.జయసూర్య నేతృత్వంలో హనుమాన్‌జంక్షన్ సీఐ నవీన్, ఆత్కూరు ఎస్ఐ సూర్య శ్రీనివాస్ మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. గన్నవరం మండలం చిన్న అవుటపల్లిలో జాతీయ రహదారిపై శనివారం ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గమనించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వారు హైదరాబాద్ కుత్బుల్లాపూర్‌కు చెందిన పీతాంబరం మాధవ కృష్ణ(26), గుంపన వెంకటరమణ(26)గా తెలుసుకున్నారు. వారిద్దరూ గతంలో కూడా హనుమాన్‌జంక్షన్‌లో చైన్‌స్నాచింగ్ చేసినట్టు, ఈ నెలలో ఏలూరు, రాజమండ్రి, తుని ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు విచారణలో తెలుసుకున్నారు. నిందితుల వద్ద నుంచి ఒక యమహా బైక్, 2 సెల్‌ఫోన్లు, ఒక బంగారపు నానుతాడు, ఒక చాకును స్వాధీనపరచుకున్నట్లు పోలీసులు తెలిపారు. గన్నవరం 11వ అదనపు మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ కోర్టులో నిందితులను హాజరుపరిచారు.

కొత్త వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు

ఉయ్యూరు: తాగునీటి సరఫరాకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని 18వ వార్డు కౌన్సిలర్ షేక్ నూర్జహాన్ అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడి తరచూ తాగునీటి సమస్య ఏర్పడుతోంది. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణకు కౌన్సిలర్ నూర్జహాన్ విజ్ఞప్తిచేశారు. దీంతో శనివారం మున్సిపల్ అధికారులు లీకేజీలు ఏర్పడిన ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్లను ఏర్పాటుచేసి తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో జంక్షన్ చిన్నారికి బహుమతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో హనుమాన్ జంక్షన్ చిన్నారి ప్రోత్సాహక బహుమతిని సొంతం చేసుకుంది. స్థానిక విశ్వకవి హైస్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్న కె.మోహన వెంకట భానుశ్రీ మచిలీపట్నంలోని మహతి కళా వేదికలో శనివారం జరిగిన భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో ప్రోత్సాహక బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా భానుశ్రీని, తర్ఫీదు ఇచ్చిన తల్లిదండ్రులు రాధారాణి, శివానంద శర్మలను పాఠశాల ప్రిన్సిపాల్ కె.అనిత అభినందించారు.

120 మందికి వైద్య పరీక్షలు

ఉయ్యూరు: మండలంలోని బోళ్లపాడు గ్రామంలో రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్టు ఉయ్యూరు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రవికుమార్, అనిత 120 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్‌టీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి నాగ సుబ్రమణ్యం, ప్రతినిధులు పులి శ్రీనివాసరావు, చింత కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

రెండు కంప్యూటర్ల వితరణ

గన్నవరం: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయానికి గ్రామానికి చెందిన జాస్తి వెంకట కృష్ణారావు రూ.45 వేలు విలువైన రెండు కంప్యూటర్లను వితరణగా ఇచ్చారు. శనివారం కంప్యూటర్లను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావుకు అందజేశారు. పీఎస్ఆర్.బ్రహ్మ, ఎం.రాధాకృష్ణ, వి. సత్యనారాయణ, గ్రంథాలయ ఇన్‌చార్జ్ దొండపాటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

కంకిపాడు: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఏపీ అసెంబ్లీ ఓఎస్‌డీ ఎం.ప్రభాకర్ అన్నారు. ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో శనివారం క్రీడా వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. క్రీడా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎస్ఐ కె.సుధాకర్ మాట్లాడుతూ మనో వికాసానికి, క్రమశిక్షణకు, క్రీడలు దోహదపడతాయన్నారు. విద్యాసంస్థల సీఏసీ సుధారాణి మాట్లాడుతూ అంతర్జాతీయంగా రాణిస్తున్న క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ పద్మావతి పర్యవేక్షించారు. విద్యాసంస్థల అధినేత విజయబాబు విజేతలను అభినందించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 225 మందికి ఉద్యోగాలు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో 2024 గ్రాడ్యుయేషన్ బ్యాచ్ విద్యార్థులు 252 మంది క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ కళాశాలలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ యాక్సెంచర్ ఇటీవల కాలేజీలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించిందని తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో మొత్తం 440 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 252 మందికి ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన వీరిలో సీఎస్‌సీ, ఐటీ, ఈసీఈ, ఈఈఈ, ఈఐఈ, ఎంఈఏ, సివిల్ కోర్సులు చదివిన విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు ఏడాదికి రూ 4.50 లక్షలు జీతం పొందుతారని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాల్లో అనిశ్చితి ఉన్నప్పటికి తమ కాలేజీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వీఆర్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. సమావేశంలో ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.



క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

ఉత్సాహంగా...ఉల్లాసంగా బాలోత్సవం



కోలాట ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులతో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

గన్నవరం: పిల్లలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలోత్సవం పోటీలు దోహదపడతాయని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం దివంగత వల్లభనేని రమేష్‌చంద్ ప్రాంగణంలో కాట్రగడ్డ రవీంద్ర వేదికపై బాలోత్సవం ద్వితీయ పిల్లల పండుగ ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగింది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు అకడమిక్, సాంస్కృతిక పోటీల్లో సత్తా చాటారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వంశీమోహన్ పిల్లల జానపద, కోలాట, నృత్య ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక, కళాత్మక, సామాజిక సేవా రంగాల్లో రాణించాలని, ఈ దిశగా పిల్లలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ గత రెండేళ్లుగా బాలోత్సవం నిర్వహిస్తున్న కమిటీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ. గౌసాని, జెడ్పీ సీఈఓ వీర్ల జ్యోతిబసు, విజయవాడ బాలోత్సవం కమిటీ కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, గన్నవరం కమిటీ అధ్యక్షుడు బొద్దు నాగేశ్వరరావు, కార్యనిర్వహణ కార్యదర్శి గన్నె వెంకట్రావు, కార్యదర్శి కర్రా వరప్రసాద్, చలువాది మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

బాలోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల స్థాయిలో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జరిగిన జానపద, కోలాటం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు, ఏకపాత్రాభినయం, దేశభక్తి పాటల పోటీలో విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. సాయంత్రం విజేతలకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతతో బహుళ ప్రయోజనాలు



ముస్తాబాదలో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై ప్రచారం చేస్తున్న కళాకారులు

గన్నవరంరూరల్: ప్రజల్లో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై విస్తృత అవగాహన పెరగాలని ముస్తాబాద సహకార బ్యాంకు చైర్‌పర్సన్ మేడసాని శ్రీనివాస చౌదరి అన్నారు. స్థానిక పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనివారం ముస్తాబాద, సావరగూడెం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, నాబార్డు సంయుక్తంగా ప్రజల్లో అవగాహన పెంచటం గొప్ప విషయమన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్న రుణ సౌకర్యాలు, పొదుపు ఖాతాల నిర్వహణపై లాభాలను వివరించాలని ప్రచార జాత కళాకారులకు సూచించారు. పీఎం జీవనజ్యోతి, బీమా, సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, ఏటీఎం రూపే అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. కళాకారులు పాటల ద్వారా, నాటికల ద్వారా సహకార బ్యాంకు ప్రయోజనాలను తెలియజేశారు.

డీపీఎస్‌కు ఉత్తమ పాఠశాల అవార్డు



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు బ్రెయిన్ ఫీడ్ మ్యాగజైన్‌వారు ఉత్తమ పాఠశాలగా అవార్డును ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో ఈనెల 15న నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్‌చంద్ ఈ అవార్డును అందుకున్నారు. నూతన పద్ధతుల్లో విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా విద్యను బోధిస్తున్నందుకు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రో.వైస్ చైర్మన్ నరేంద్రబాబు మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నందుకు ఈ అవార్డు పాఠశాలకు వరించిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విద్యా వికాస కార్యక్రమాలు నిర్వహించడానికి ఈ అవార్డు ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. ఈ అవార్డు సాధించినందుకు పాఠశాల డైరెక్టర్ కడియాల ప్రవీణ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

ఎన్యూమరేషన్‌పై సూపర్ చెక్



రైతుతో మాట్లాడుతున్న తహసీల్దార్ శివయ్య

పెనమలూరు: మండల పరిధిలో జరుగుతున్న ఎన్యూమరేషన్‌పై రెవెన్యూ అధికారులు సూపర్ చెక్ నిర్వహించారు. పెనమలూరు గ్రామంలో శనివారం తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, డెప్యూటీ తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, రీసర్వే డెప్యూటీ తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ భరద్వాజ్ తుపాను కారణంగా నేలవాలిన పంట పొలాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే వీఏఏలు, వీఆర్వోలు పంట నష్టంపై ఎన్యూమరేషన్ చేశారు. ఎన్యూమరేషన్‌లో ఎటువంటి లోపాలు లేకుండా ఉండటానికి రెవెన్యూ అధికారులు సూపర్ చెక్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఈ నెల 18వ తేదీతో ముగుస్తుందన్నారు. రైతులు వారు నష్టపోయిన పంటల వివరాలు నమోదు చేయించుకోని ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ పొందాలన్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి పంట నష్టం వివరాలు ఆయా గ్రామాల్లోని సచివాలయాలు, ఆర్బీకేల్లో ఉంచుతామన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఏలూరుటౌన్: ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని గన్నవరం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడిన వ్యక్తి విజయవాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గన్నవరం రైల్వే స్టేషన్ సమీపంలోని మర్లపాలెం రైల్వేగేటు వద్ద ఈనెల 15వ తేదీ రాత్రి 8.50 గంటల సమయంలో సుమారు 55 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని 108 అంబులెన్స్‌లో విజయవాడ జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడు నెల్లూరు నగరానికి చెందిన కాయల ఏడుకొండలుగా గుర్తించారు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.